క్లుప్తంగా

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ



మానవపాడు: ప్రభుత్వం రుణమాఫీ పథకంపై రైతులకు వివరించి, రుణమాఫీ పొందిన రైతులు వెంటనే బ్యాంకులను సందర్శించి తిరిగి రుణాలు పొందాలని అలంపూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సక్రియ నాయక్ తెలిపారు. శుక్రవారం నారాయణపురం, పెద్ద ఆముదాలపాడు గ్రామాల్లో రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుబీమా దరఖాస్తులు స్వీకరించడానికి ఆగస్టు 5వ తేదీ వరకు గడువు ఉందని, కొత్త పాసు పుస్తకాలు వచ్చిన రైతులందరూ సోమవారం లోపు దరఖాస్తులు సంబంధిత వ్యవసాయ విస్తీరణ అధికారులకు అందించాలని సూచించారు. 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగు అయిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దశరథ రామయ్య, రైతు రామచంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రమేష్, భీమేష్, రంగన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: చెట్ల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు చేయనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ టౌన్ ఏఈ శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30గంటల నంచి 11:30గంటల వరకు జిల్లా కేంద్రంలోని భీంనగర్, రెవెన్యూ కాలనీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం తనిఖీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకులపాడు, మానవపాడు, అమరవాయి, చెన్నిపాడు గ్రామాల్లో పలు షాపులు నుంచి శాంపిళ్లను సేకరించామన్నారు. ఎరువుల ఎక్కువ ధరకు అమ్మకుండా షాపు యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన హెచ్‌ఎం



శాంతినగర్: పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా వడ్డేపల్లి మండలంలోని వెంకట్రామనగర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలో ఆరు మొక్కలు నాటినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

ఉరుకుంద ఈరన్నకు భక్తుల పాదయాత్ర



రాజోళి: మండల కేంద్రం నుంచి ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధికి శుక్రవారం భక్తులు పాదయాత్ర చేపట్టారు. మండల కేంద్రం నుంచి 150 మంది భక్తులు పాదయాత్రగా ఉరుకుందస్వామి పుణ్యక్షేత్రానికి బయల్దేరారు. ప్రతిఏట పాదయాత్ర చేస్తూ స్వామివారిని దర్శించుకుంటామని ఈ సందర్భంగా భక్తులు తెలిపారు.

శిక్షణ తరగతులు విజయవంతం చేయండి



గద్వాల అర్బన్: నాగర్‌కర్నూల్ జిల్లాలో శని, ఆది వారాల్లో నిర్వహించే ఏఐటీయూసీ శిక్షణ తరగతులకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని నల్లకుంటలో హమాలీ కా ర్మికులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల హక్కులు, చట్టాలు, వారి భద్రత తదితర అంశాలపై శిక్షణ తరగతుల్లో నిపుణులతో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘం కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షుడు రా జు, వెంకటేష్, పరశురామ్ ఉన్నారు.

వంతెనకు మోక్షమెప్పుడో?

- వర్షాకాలంలో పొంగుతున్న వాగులు
- వాగు దాటలేక ప్రజలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



అసంపూర్తిగా ఉన్న ఎక్లాస్‌పురం వంతెన నిర్మాణం

అయిజ: మండలంలోని వివిధ గ్రామాల శివార్లలో చేపట్టిన వంతెన పనులు పూర్తి కాలేదు. కొన్ని ప్రదేశాల్లో వంతెన నిర్మాణం పనులు పూర్తయినా అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. మరికొన్ని ప్రదేశాల్లో వంతెన పనులు పూర్తయినా రోడ్డు పనులు ప్రారంభించ లేదు.

ప్రయాణానికి అడ్డంకులుగా..

భారీ వర్షాలు కురిస్తే వరదనీరు వాగులో ఉధృతంగా ప్రవహించడంతో ప్రయాణానికి ప్రతికూలంగా ఉంటుంది. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇతర గ్రామాలకు చేరుకోలేని పరిస్థితి. వృద్ధులు, మహిళలు వర్షాకాలంలో వాగుదాటేందుకు అవస్థలు పడుతున్నారు. రైతులు పంటపొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతుంటారు. అత్యవసర సమయంలో 108 గ్రామంలోకి రాలేని పరిస్థితి ఉంటుంది. ఆటోలు, మోటార్ సైకిళ్లు కూడా వాగులోని వరదను దాటి రాలేని పరిస్థితి ఉంటుంది. మండలంలో వివిధ గ్రామాల వద్ద చేపట్టిన వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రజలు అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

నిర్మాణ దశలో వంతెన పనులు..

మండల కేంద్రంలో పాత బస్టాండ్–కొత్త బస్టాండ్ మధ్య రూ.7కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణం పూర్తయినా అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. గుడుదొడ్డి–చిప్పదొడ్డి మధ్య రూ.3.58 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణం పూర్తయినా అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించలేదు. యాపదిన్నె శివారులో రూ.3.30 కోట్లతో నిర్మించిన వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు పనులు పూర్తికాలేదు. అయిజ సమీపంలో పోలోనివాగుపై రూ.2.79 కోట్లతో చేపట్టిన వంతెన స్లాబ్ వేయకుండానే పనులు నిలిచిపోయాయి. అయిజ–ఎక్లాస్‌పురం మధ్య పెద్దవాగుపై రూ.5 కోట్ల నిధులతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఆరు సంవత్సరాలవుతున్నా ఇంతవరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు.

నిర్మాణం చేపట్టలేదు



వాగులపై వంతెనలు నిర్మించాలని అనేక సంవత్సరాల నుంచి ప్రజలు అధికారులను కోరు తున్నారు. నిర్మాణ పనులు పూర్తి చేస్తామని, ఇంతవరకు పనులు పూర్తి చేయలేదు. వెంటనే బ్రిడ్జి పనులు పూర్తిచేయాలి.

– ఉరుకుందు, ఈడుగోనిపల్లి

అప్రోచ్ రోడ్లు నిర్మించలేదు



అయిజ మండలంలోని వివిధ గ్రామాలవద్ద చేపట్టిన వెంతనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించాలి. వంతెనలు నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా అప్రోచ్ రోడ్లు నిర్మాణం పూర్తికావడం లేదు. సీసీ వర్షాకాలం రోడ్లు బురుదగుంతలుగా మారుతున్నాయి. కాలినడకన కూడా వెళ్లేందుకు వీలు కావడంలేదు. అవసరమైన ప్రదేశాల్లో కల్వర్టులు నిర్మిస్తే బాగుంటుంది.

– కృష్ణ, సంకాపురం

పనులు పూర్తిచేయాలి



ఎండాకాలంలో బ్రిడ్జి పనులు ప్రారంభించి, వానాకాలం సమయానికి పూర్తిచేయాలి. బ్రిడ్జి లేకపోవడంతో వానాకాలం వాగులో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగుదాటలేక ఎక్కడివారు అక్కడే ఉండిపోవాల్సి వస్తోంది. ఆస్పత్రికి పోవాల్సి వస్తే వానాకాలం వాగుదాటి వాహనాలు రావడంలేదు. బ్రిడ్జిపనులు వెంటనే పూర్తిచేయాలి.

– నజీర్, అయిజ

త్వరలో పనులు పూర్తిచేస్తాం..



మండంలోని వివిధ గ్రామాలకు వాగులపై వంతెనలు నిర్మిస్తేనే ప్రయాణం సాఫీగా సాగుతుంది. కొన్ని చోట్ల వంతెన పనులు పూర్తయినా సరే అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి కాలేదు. కొన్ని ప్రదేశాల్లో కల్వర్టులు ఏర్పరాటు చేయాల్సి ఉంది. పనులు త్వరగా పూర్తి చేయించాలని ఆయా శాఖల అధికారులపై వత్తడి తెస్తున్నాం.

– వెంకటయ్య, ఎంపీడీఓ

అటెన్షన్ ప్లీజ్

అద్దెభవనంలో వసతిగృహం



ఉండవెల్లిలో శిథిలావస్థలోని భవనం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో అయిదేళ్లుగా కొనసాగుతోంది. కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 30 ఏళ్లుగా ఉన్న సొంత భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో భవనం పునర్నిర్మించేందుకు అధికారులు గతంలో ఎస్టిమేట్ వేసినా పురోగతి లేదు. ప్రస్తుతం కలెక్టర్ శిథిలావస్థకు చేరిన భవనాన్ని, విద్యార్థులు అద్దెకు ఉంటున్న భవనాలను పరిశీలించారు. భవన నిర్మాణ అధికారులతో చర్చించి ఎస్టిమేట్ వేయించి పునర్నిర్మాణం చేస్తామని చెప్పారు. భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

సంప్రదించవలసిన అధికారి: సరోజ, ఏఎస్‌డబ్ల్యూఓ,అలంపూర్, సెల్: 9959755003

అమ్మపాలే బిడ్డకు అమృతం



బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి లత

శాంతినగర్: పుట్టిన బిడ్డకు అమ్మపాలే అమృతమని కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ప్రతినిధి లత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామం అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవం రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకత గురించి బాలింతలకు వివరించారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తి నిచ్చే యాంటీబాడీస్ ఉంటాయని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ శాంతి మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని, శిశువు పుట్టినప్పటి నుంచి రెండేళ్లవరకు తల్లిపాలు తాగించాలని సూచించారు. తల్లి కూర్చోని మాత్రమే పాలివ్వాలని, పడుకుని ఇవ్వరాదన్నారు. శిశువు, తల్లి ఆరోగ్యం కోసం పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం వెంకటేశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, దస్తగిరమ్మ, వరలక్ష్మి, ఆశా వర్కర్స్ కృష్ణవేణి, మమత, వెంకటలక్ష్మి, సుంకులమ్మ, పద్మ, బాలింతలు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై సంబరాలు

- అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు
- గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ర్యాలీలు
- మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం



కేటీదొడ్డిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న నాయకులు



ఉండవెల్లిలో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘం నాయకులు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. బైక్‌ర్యాలీ చేసి అంబేడ్కర్ విగ్రహం దగ్గర మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ కేక్‌కట్ చేశారు. అనంతరం మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మద్దిలేటి, జాన, జగ్‌జీవన్, తదితరలు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: ఎస్సీల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు మండల కేంద్రంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం దగ్గర మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు జంబయ్య, రంగస్వామి, ప్రదీఫ్ తదితరులు ఉన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అనుబంద సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు ఎలీషా, మస్తాన్, మాజీ వైస్ ఎంపీపీ దేవన్న, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రం అంబేడ్కర్ విగ్రహం దగ్గర, మాచర్లలో సంబరాలు, ర్యాలీలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న, తెలిపారు. కార్యక్రమంలో మాచర్ల ప్రకాష్, కొమ్ముల ప్రవీన్, ఇమ్మానియేలు, బల్గెర ముక్కెరన్న, తిమ్మప్ప, నర్సింహులు, ఆనంద్, బండారి సునంద్, సంతోష్, కారెప్ప, వీరేష్, రాము, కువేష్, బండారి డేవిడ్ పాల్గొన్నారు.

ధరూరు: ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాల పాటు అలుపెరగని పోరాటం చేసి సాధించుకున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సీనియర్ నాయకులు చిన్నపాడు ఆంజనేయులు, డ్యాం వెంకటన్న, మార్లబీడు దేవదాసు, రాములు, చరణ్, రంగస్వామి, రాములు, శంకర్, క్రిష్ణ పాల్గొన్నారు.

అయిజ: ఎస్సీ వర్గీకరణపై అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పుకు హర్షం వక్యంచేస్తూ కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మందకృష్ణ, సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ సంపత్ కుమార్‌ల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకుడు మద్దిలేటి, కౌన్సిలర్లు గిత్తల దేవరాజు, రాణెమ్మ, సులోచనమ్మ పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని బిజ్వారం, అమరవాయి, మల్దకల్, ఎల్కూరు, కుర్తిరావులచెర్వు, తాటికుంట, పాల్వాయి, విఠలాపురం గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి శుక్రవారం మాజీ ఎంపీపీ రాజారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు తిరుమలేష్, దేవసాయం, దాసు, వెంకటన్న, కర్రెన్న, తిమ్మోతి, ఆనంద్ పాల్గొన్నారు.

ముగిసిన పీరు ఉత్సవం

అలంపూర్ రూరల్: అలంపూర్ మండలంలోని ఊట్కూర్ గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించిన పీరు ఉత్సవం శుక్రవారం ముగిసింది. మౌలాలి సామి పీరు సవారి గ్రామంలో సందడి నెలకొంది. పీరు సవారిని తిలకించేందుకు భక్తులు ధిక సంఖ్యలో తరలి వచ్చారు. పీరును పురవీధుల గుండా తిప్పి నదిలో నిమజ్జనం చేశారు.

దోమల నివారణకు ఆయిల్ బాల్స్



శాంతినగర్: వడ్డేపల్లి పురపాలికలో దోమల నివారణకు ప్రత్యేకచర్యలు చేపట్టారు. ఆయా వార్డుల్లోని మురుగునీటి కాలువల్లో శుక్రవారం ఆయిల్ బాల్స్ వేశారు. లార్వాలు వృద్ధి చెందకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. నీరు నిల్వ ఉన్న గుంతల్లో దోమలు ఉధృతి చెందకుండా మట్టిని నింపడం, రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగించే పనులు చేపడుతున్నారు.



ధరూరు: పది రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలతో దోమల బెడద తీవ్రమైంది. జనం రోగాల బారిన పడకుండా ఉండేందుకు మండల కేంద్రంలో ముందస్తు చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో వైఎస్ఆర్, అంబేడ్కర్ సర్కిళ్లతో పాటు ఆయా కాలనీల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి దగ్గరుండి ఫాగింగ్ యంత్రంతో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు.

కంటైనర్ అదుపు తప్పి బోల్తా

మానవపాడు: జాతీయ రహదారి–44పై కంటైనర్ అదుపు తప్పి బోల్తా పడ్డ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తు న్న కంటైనర్ జాతీయ రహదారి–44పై బోరవెల్లి శివారుప్రాంతంలో అదుపు తప్పి బోల్తా ప డింది. డ్రైవర్‌కు, క్లీనర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.

పారిశుద్ధ్యం పడకేసింది

అయిజ: మండలంలోని తూంకుంటలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో కొన్ని సంవత్సరాలుగా పారిశుద్ధ్యం పడకేసింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో గ్రామం మురికి కూపంగా మారింది. వర్షం నీటితో పాటు గృహాల నుంచి వచ్చే మురుగు రోడ్లపై చేరి మట్టి రోడ్లు బురుదగుంటలుగా మారాయి. రోడ్లపై కాలినడకన వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



వడ్డేపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాంతినగర్: తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని సీపీఐ(యంఎల్) గద్వాల డివిజన్ నాయకులు జమ్మిచేడు కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వడ్డేపల్లి తహసీల్దార్ జ్యోషి శ్రీనివాస్‌శర్మకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు కొందరికి రేషన్ కార్డులు లేకపోవడంతో అటు వైద్యానికి, ఇటు రుణమాఫీకి, మరోవైపు ఉచిత కరెంట్‌లాంటి సంక్షేమ పథకాలకు నోచుకోవడంలేదని వాపోయారు. ఇళ్ల నిర్మాణానికి పేదలకు రూ.10 లక్షలు మంజూరు చేయాలని, వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రేమరాజు, పచ్చర్ల తిప్పన్న, శేఖర్, రమేష్, మద్దిలేటి, ప్రభుదాసు, దేవదాసు, నాగరాజు పాల్గొన్నారు.

మానవపాడు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ మాస్‌లైన్ డివిజన్ జమ్మిచేడు కార్తీక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తహసీల్దార్ వాహీదా ఖాతూన్‌కు వినతిపత్రం అందించారు. ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మప్ప, మద్దిలేటి, ప్రభుదాసు, యశోదమ్మ, వెంకటేశ్వరమ్మ, ఫకీర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



అలంపూర్ పోలీస్ స్టేషన్‌లో తాజా మాజీ సర్పంచ్‌లు



ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌లో ముందస్తుగా అరెస్ట్ చేసిన మాజీ సర్పంచులు

అలంపూర్: పెండింగ్ బిల్లుల కోసం ఉద్యమిస్తున్న తాజా మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అలంపూర్ మండలంలోని తాజా మాజీ సర్పంచ్‌లు కుబ్రా సర్దార్, అయ్యస్వామి, శ్రీనివాసులుతో పాటు పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లను పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 2019 నుంచి పదవీ కాలంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. సర్పంచ్‌లకు ఒక లక్ష నుంచి రూ.10 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉన్నట్లు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగా అరెస్టు చేశారు. ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికమని తెలిపారు.

ఉండవెల్లి: మండలంలోని మాజీ సర్పంచులు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం పిలుపు మేరకు పెండింగ్ బిల్లుపై ధర్నాకు వెళ్తున్న వారిని పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వీరన్న, మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు లోకేశ్వరెడ్డి, మాజీ సర్పంచులు శేషన్ గౌడు, నాగేష్, శివ నారాయణ, నరేంద్ర నాయుడు, తదితరులు ఉన్నారు.

శాంతినగర్: పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను శాంతినగర్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. మానవపాడు మండలం కలుకుంట్ల మాజీ సర్పంచ్ ఆత్మలింగారెడ్డి, వడ్డేపల్లి మండలం వెంకట్రామనగర్ మాజీ సర్పంచ్ ఆంజనేయులును శాంతినగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

మానవపాడు: పెండింగ్ బిల్లులు చెల్లించాలని శుక్రవారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో గన్‌పార్కు వద్ద మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన దీక్షకు వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్ట్ చేశామని ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. మాజీ సర్పంచ్‌ల సొంతపూచికత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



కలుకుంట్లలో సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మానవపాడు: అంకిత భావంతో పనిచేస్తేనే ఉపాధ్యాయులకు గుర్తింపు వస్తుందని ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని అమరవాయి, కలుకుంట్ల పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మల్లన్న, వందనమయ్య, మౌలాలి, ఈశ్వరమ్మ, జ్యోతి తదితర ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఉపాధ్యాయులు చేసిన సేవలను కోనియాడారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు ఆత్మలింగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

గద్వాల క్రైం: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి గద్వాల పట్టణ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మల్దకల్ మండల కేంద్రానికి చెందిన అశోక్ (30) జిరాక్స్ షాపు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పని నిమిత్తం స్వగ్రామం నుంచి గద్వాలకు వచ్చాడు. రాత్రి 7 గంటల సమయంలో గద్వాల–కర్నూల్ వెళ్లే మేలచెర్వు) రైలుమార్గం సమీపంలో తండ్రి శ్యాంసోన్‌కు ఫోన్ చేసి జీవితంపై విరక్తి ఉందని చెబుతూ గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రి మార్చూరీకి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. తండ్రి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

గద్వాల క్రైం: అగ్నిప్రమాదాలు అంటేనే ప్రజలందరు భయపడతారని గద్వాల అగ్నిమాపక అధికారి రమేష్ అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంటగది, వ్యవసాయ క్షేత్రా లు, షాపింగ్ మాల్స్, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, కార్యాలయాలు, పెట్రోల్ బంకులు ఇలా ఏ స్థలంలోనైనా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. వంటగదుల్లో గాలి, వెలుతురు ఉండేటట్లు అమర్చుకోవాలన్నారు. నాసికరకం ఎలక్ట్రికల్ సామగ్రిని వద్దొన్నారు. వంట చేస్తున్నప్పుడు దుస్తులకు నిప్పు అంటుకుంటే పరుగెత్తకుండా నేలపై దొర్లాలన్నారు. కాలిన శరీర భాగంపై చల్లని నీరు పోయ కుండా మందటి దుప్పటి వంటివి వారికి చుట్టాలన్నారు. ప్రమాదమైతే వెంటనే 101, 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కళాశాల సిబ్బంది రిణా నిరూపమ, శ్రీధర్‌రెడ్డి, ఫైర్ సిబ్బంది గౌస్‌పాష ఉన్నారు.